క్లుప్తంగా

పాడె మోసిన ఎమ్మెల్యే


అంతిమయాత్రలో పాడె మోస్తున్న కోనప్ప

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన లెక్కల సుజాత అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరామర్శించారు. సుజాత బీఆర్ఎస్ కార్యకర్త మహేష్ తల్లి కావడంతో అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కంబగౌని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల ఉదారత


స్నాక్స్ అందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

కెరమెరి: మండలంలోని కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ఆడె ప్రకాశ్‌తో పాటు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో స్నాక్స్ అందిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటల తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో స్నాక్స్ అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

'లక్ష్మీనారాయణ గౌడ్ మృతి తీరని లోటు'

కాగజ్‌నగర్‌టౌన్: సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా కోశాధికారి జి.లక్ష్మీనారాయణ గౌడ్ మృతి తీరని లోటని సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. మంగళవారం సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు, విశ్రాంత ఉద్యోగ సంఘ సభ్యులతో కలిసి లక్ష్మీనారాయణ స్వగృహానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్ రావు, నారాయణ, సభ్యులు కలికోట రమణయ్య, వాహబ్, దేవయ్య, జగదీశ్వర్, మండలాధ్యక్షుడు జెల్లగౌడ్, వి.బాపు, విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, మగ్బుల్ హుస్సేన్, బావండ్ల పెల్లి నర్సయ్య, నర్సయ్య, సీతారాం తదితరులు ఉన్నారు.

సఖీ సేవలపై అవగాహన

దహెగాం: మండలంలోని రాంపూర్ గ్రామంలో సఖి కేంద్రం సభ్యులు మంగళవారం సఖీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేంద్రం సభ్యులు శ్రీనిధి, సత్యశీల, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోతేపల్లిలో పౌరహక్కులపై..

పెంచికల్‌పేట్: మండలంలోని పోతేపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం పౌరహక్కుల దినం సందర్భంగా తహసీల్దార్ సరిత ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు చట్టలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో సర్పంచ్ చంద్రమౌళి, ఏఎస్సై గంగారం, ఏఈ గౌసియాబేగం, ఆర్ఐ గోపాల్, సురేష్, కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా బోధించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం అనురాధ బాయి

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా బోధన చేయాలని తక్కళ్లపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం అనురాధ బాయి అన్నారు. తక్కళ్లపల్లి పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు లోకేష్, సూర్యనారాయణ, వెంకటాచారి, మౌనిక, నీల, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

కౌటాల: మండలంలోని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు విఠలరుక్మిణి గరుడ ధ్వజస్తంభం, నవగ్రహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న ఆలయంలో దేవతల ఊరేగింపు, మంత్ర హోమాలు, యాగశాల ప్రవేశం, 3న కుంకుమార్చన, కాలపూజ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 4వ తేదీన దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి అభిషేకం, మహాపూజ, గోపాల కాల, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిర్మించి.. వదిలేశారు!

- నిరుపయోగంగా చెక్‌పోస్టు భవనం
- ఏడేళ్లవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం


నిరుపయోగంగా ఉన్న చెక్‌పోస్టు భవనం


గదిలో పగిలిన మద్యం సీసాలు


పగిలిన పైకప్పు

కెరమెరి: అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏడేళ్ల క్రితం నిర్మించిన మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు భవనం నిరుపయోగంగా మారింది. నిర్మించిన కొత్త భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో లక్షల రూపాయలు వృథా అయ్యాయి. మండలంలోని కేస్లాగూడ గ్రామ సమీపంలో రూ.2 లక్షలతో గతంలో మార్కెట్ చెక్‌పోస్టు నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత భవనాన్ని వినియోగించడం మరిచిపోయారు. నిర్మాణం కంటే ముందు హడావిడి చేసిన అధికారులు ఆ తర్వాత దాని గురించి పట్టించుకోవడమే మరిచిపోయారు.

అంతుచిక్కని ఆంతర్యం..

భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఏ ఒక్క అధికారి కూడ అటు వైపునకు వెళ్లలేదు. ఏడేళ్లు గడుస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. చెక్‌పోస్టు భవనం నిర్మించిన రోడ్డులో పెద్దగా వాహనాల రాకపోకలు కూడా ఉండవు. కేవలం పత్తి సీజన్‌లో మాత్రమే పత్తి బండ్లు ఆదిలాబాద్‌కు వెళ్తుంటాయి. అయినా ఇక్కడ మార్కెట్ చెక్‌పోస్టు భవనం నిర్మించడంలో ఆంతర్యం ఏంటన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు.

ఆకతాయిలకు అడ్డాగా..

లక్షల రూపాయలతో నిర్మించిన భవనం ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. భవనంలో ప్రతిరోజు రాత్రి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామానికి కొంత దూరంలో ఉన్న భవనంలో రెండు గదులు, ఒక వరండా ఉంది. తలుపులు, కిటికీలు బాగానే ఉన్నా ఒక గదిలో పైకప్పు రేకులు పగిలిపోయాయి. కాగా భవనంలోని అడుగు భాగం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం



వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి చెక్‌పోస్టును వినియోగంలోకి తెస్తాం. మరమ్మతుల కోసం ఇప్పటికే ఎస్టిమేట్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే ప్రహరీ నిర్మాణం, తాగునీటి వసతి, ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తి చేస్తాం.

- గాదినేని మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్, ఆసిఫాబాద్

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గ్రామాల్లో శునకాల బీభత్సం
- భయాందోళన చెందుతున్న ప్రజలు
- గొర్రెలు, మేకల మందలపై దాడులు


కౌటాలలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కౌటాల: మండలంలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి. గ్రామాల్లో వీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సానికి పిల్లలు, పెద్దలు నానా అవస్థలు పడుతున్నారు. ఒంటరిగా రోడ్లపైకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో కుక్కలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

వీధుల్లో తిరుగుతూ..

వీధుల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ జనంపై పడుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్తంపేట, యాపలగూడ, బోదంపల్లి, సదాశివపేట, తలోడి, గుడ్లబోరి, మొగడ్‌దగడ్, గురుడుపేట, గుండాయిపేట, వీర్దండి, తుమ్మిడిహెట్టి, తదితర గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. కౌటాల –బెజ్జూర్ రహదారి వెంబడి ఉన్న ముత్తంపేట, సదాశివపేట, యాపలగూడ, గురుడుపేట, బోదంపల్లి గ్రామాలలో రాత్రిపూట ప్రయాణించే వారికి చుక్కలు చూపెడుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాహనదారులను వెంబడిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కలు గేదెలు, మేకలు, దూడలపై దాడులు చేస్తున్నాయి. దీంతో పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

మండలంలోని వీధి కుక్కల బెడద నివారించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని మండల వాసులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

భయాందోళన చెందుతున్నాం

రాత్రి వేళల్లో రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో ప్రయాణం చేయడానికి భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఎం. రవి, యాపలగూడ

కుక్కల బెడద నివారించాలి

మండలంలో ఆయా గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కుక్కలు ఎప్పుడు దాడి చేస్తాయోనని భయపడుతున్నాం. మండలంలోని పలు గ్రామాల్లో గేదెలు, మేకలు, దూడలపై కుక్కలు దాడులు చేస్తున్నాయి.

- మమత, కన్నెపల్లి

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ధరణి, ఫొటో ఓటరు జాబితా, గుర్తింపు కార్డులపై తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమస్యలపై రికార్డులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ధ్రువపత్రాల జారీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మంజూరు కోసం నివేదిక రూపొందించాలని తెలిపారు. 2, 3 ఓటరు కార్డులు కలిగి ఉన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. జిల్లాలో 585 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులపై తహసీల్దార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టర్మినల్ బెనిఫిట్స్ పొదుపుగా వాడుకోవాలి


రిటైర్డ్ ఉద్యోగురాలిని సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన: సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులు టర్మినల్ బెనిఫిట్స్‌ను పొదుపుగా వాడుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. జీఎం కార్యాలయంలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన వేముల లక్ష్మిని ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, డీవైజీఎం తిరుపతి, పిట్ కార్యదర్శి రవీందర్, నాయకులు ప్రకాష్‌రావు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కైరిగూడలో..

కైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్లు గంగిశెట్టి శ్రీనివాస్, పెద్దాల పోషం, ఎలక్ట్రీషన్ గోవింద్‌రావులు మంగళవారం ఉద్యోగ విరమణ పొందగా ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్‌తో పాటు ఓసీపీ అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ నాయకులు శ్రీనివాస్‌రావు, ప్రకాష్‌రావు, మంగీలాల్, వెంకటేశం, మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి వేణు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


జైనూర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న వైస్ఎంపీపీ

నార్నూర్(జైనూర్): ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ఎంపీపీ చీర్లె లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని జంగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. సర్పంచ్ శ్యాం రావు, ఉప సర్పంచ్ షేక్ చాంద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చిన్న మధు, వైద్యాధికారి జితేందర్ తదితరులు ఉన్నారు.

కోర్సినిలో ముగిసిన కంటివెలుగు శిబిరం

చింతలమానెపల్లి: మండలంలోని కోర్సిని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం మంగళవారం ముగిసింది. స్థానిక రైతువేదికలో నిర్వహించిన శిబిరంలో 305మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి అజ్మీర రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం నుంచి లంబాడిహేటి గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎన్. రమేశ్‌బాబు

కెరమెరి: ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం కాంప్లెక్స్ ఎఫ్ఎల్ఎన్ క్లస్టర్ నోడల్ అధికారి, హెచ్ఎం నల్లగొండ రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కెరమెరి, గోయగాం, ఝరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ప్రారంభం కానున్న యూడైస్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. తొలిమెట్టులో భాగంగా అన్ని పాఠశాలల్లో టీఎల్ఎంలను బాగా ఉపయోగిస్తున్నప్పటికీ ఇంకా కొత్త పద్ధతులు అవలంభించాలన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బెజ్జూర్: చదువుతో పాటు యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని తోటమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన జ్యోతిబాపూలే క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఫైనల్‌లో కన్నెపల్లి, బెజ్జూర్ జ్యోతిబాపూలే జట్లు తలపడగా, కన్నెపల్లి జట్టు విజేతగా నిలిచింది. తోటమాలి సంఘం ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులపై విచారణ చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తిర్యాణి: మండల కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించకుండానే బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో డీఆర్‌డీవో పీడీ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సార రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన సదరు కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి భర్త కావడం వల్లే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

ఆలోచన అదుర్స్..!



రెబ్బెన: కేజీవీల్స్ కారణంగా రోడ్లు దెబ్బతింటున్న నేపథ్యంలో కేజీవీల్స్ ట్రాక్టర్ రోడ్లపై నడపడాన్ని నిషేధించారు. రోడ్డు పాడవకుండా కేజీవీల్స్‌ను ట్రాక్టర్ నుంచి విడదీయకుండా మరో ట్రాక్టర్ సహాయంతో కేజీవీల్స్ ట్రాక్టర్‌ను తరలిస్తున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. మండల కేంద్రంలో మంగళవారం కేజీవీల్స్ ఉన్న ట్రాక్టర్‌ను పైకి ఎత్తి కేజీవీల్స్ రోడ్డును తాకకుండా మరో ట్రాక్టర్ సాయంతో తరలించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

రెబ్బెన: గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్‌లు అన్నారు. గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కొనసాగుతున్న జాతర ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, గంగాపూర్ పంచాయతీ కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి నిధులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని అతి పురాతన ఆలయం శ్రీ బాలేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, ఎంపీపీ మల్లిఖార్జున్, మాజీ ఎంపీపీ బొమ్మెన బాలేశ్వర్‌గౌడ్‌లు కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గోండురాజుల కాలంలో స్వయంభూగా వెలసిన ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని, ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఆలయ పరిస్థితి దేవాదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఆలయ చరిత్రతో కూడిన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండా వెంకన్న, వైరాగడె శ్రీనివాస్, నిసార్, గోపాల్‌నాయక్, సుంకరి పెంటు, మున్నా ఉన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి


గుండేపల్లిలో సమ్మేళనానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

పెంచికల్‌పేట్: గిరి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని గుండేపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. గిరిజన గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచులు మధునయ్య, ఈశ్వరి, శ్రీనివాస్, ఎంపీటీసీ శారద, నాయకులు ఓంప్రకాశ్, తిరుపతి, శ్రీనివాస్, బాపు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు వంతెన పరిశీలించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెనను మంగళవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. కూలిన వంతెన శిథిలాలను తొలగింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: విద్యుత్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ చైర్మన్ రాంచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం ఎస్ఈ వాసుదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ 2017 జూలై 29 తేదీని ఆర్టిజన్‌ల విలీన తేదీగా భావించి పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని కోరారు. 2018 పీఆర్సీ కోల్పోయిన వారికి అంతకుముందు పీఆర్సీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారం తగ్గించేందుకు ప్రతీ సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఆత్రం మారుతి, కార్యదర్శి ప్రేమ్‌సాగర్, మీడియా కార్యదర్శి దేవేందర్, నాయకులు భరత్, చంద్రయ్య, తిరుపతి పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించాలి

కౌటాల(సిర్పూర్): దూర విద్యాకేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజును అభ్యర్థులు అదనపు రుసుం లేకుండా ఈ నెల 10లోగా చెల్లించాలని గుండాయిపేట దూరవిద్యా కేంద్రం కోఆర్డినేటర్‌లు జి.హన్మంతు, టి.శ్యామ్‌సుందర్ తెలిపారు. రూ.25 అదనపు రుసుంతో 16 తేదీ వరకు, రూ.50 అదనపు రుసుంతో 22లోగా చెల్లించవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 8074476084 నంబర్‌ను గాని, గుండాయిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని దూర విద్యా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.